నేటి దినపత్రిక **సూర్య** www.suryaa.com

**18వ వసంతంలోకి..** www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక **సూర్య** www.suryaa.com

4PM www.suryaa.com
శనివారం
07 సెప్టెంబర్ 2024
పేజీలు: 02



# వినాయక చవితి శుభాకాంక్షలు



# 70 ఏళ్లు అడుగులు

## ఖైరతాబాద్ గణేష్ దర్శనం షురూ!

తెలుగురాష్ట్రాల్లో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా చేస్తున్నారు. ఊరువాడ వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. ఎడతెరపి లేని వానలు, వరదతో కాస్త ఇబ్బంది పడినా.. వరుణుడి కాస్త శాంతించటంతో చాలాచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మరోసారి ఖైరతాబాద్ వినాయకుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈసారి 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి.. పూజలు నిర్వహిస్తున్నారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు.. రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో విఘ్నేశ్వరుడిని సిద్ధం చేశారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ 28 అడుగుల వెడల్పుతో విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించింది. ఖైరతాబాద్ గణనాథుడి తొలిపూజలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఖైరతాబాద్ గణేష్ ని తెలంగాణ గవర్నర్ దర్శించుకోనున్నారు. ఈ ఏడాది సప్తముఖ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. భారీ వినాయకున్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రెండురోజులు సెలవు రావటంతో ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలను కూడా విధించారు.

### తొలి పూజకు సీఎం

నేడు వినాయకచవితి సందర్భంగా స్వామి వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన పూజలు ఉదయం 8గంటల నుంచే ప్రారంభం కానున్నాయి. ఖైరతాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి 75 అడుగుల కండువ, జంధ్యం, గరికమాలను సమర్పించనున్నారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో అలంకరిస్తారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతికి ప్రతి ఏడాది దశాబ్దాలుగా గవర్నర్ తొలిపూజ నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతున్నది. ఈ ఏడాది మొదటి సారి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిపూజకు హాజరుకానున్నారు. సాయంత్రం 3గంటల ప్రాంతంలో తెలంగాణ గవర్నర్ హాజరవుతారని ఉత్సవ కమిటీ తెలిపింది.







### విఘ్నేశ్వరుడిని పూజించే 21 పత్రిలు ఇవే..

వినాయక చవితి రోజున గణపతిని 21 రకాల పత్రిలతో పూజిస్తారు. మాచీ పత్రం (మాచిపత్రి), బృహతీ(ములక), బిల్వ(మారేడు), దూర్వ(గరిక), దత్తూర(ఉమ్మెత్త), బదరీ(రేగు), అపామార్గ(ఉత్తరేణి), తులసి, చూత(మామిడి), కరవీర(గన్నేరు), విష్ణుక్రాంత(శంఖపుష్పం), దాడిమీ(దానిమ్మ), దేవదారు, మరువక(ధవనం, మరువం), సింధువార(వావిలి), జాజి(జాజిమల్లి), గండకీ పత్రం(కామంచి), శమీ(జమ్మి), అశ్వత్థ(రావి), అర్జున(తెల్ల మద్ది), అర్క(జిల్లేడు).



### పసుపు వినాయకుడి ప్రతిమ ఎందుకంటే..

ఏ పనిలోనైనా ముందు పూజ వినాయకుడికేనన్నది సంప్రదాయం. అటు హైందవ సంప్రదాయంలో పసుపునకు ఉన్న విశిష్టత అంతాఇంతా కాదు. అందుకే గణేశ చవితిరోజున పసుపుతో చేసిన వరసిద్ధి వినాయకుడిని కొలుచుకుంటుంటాం. సహజంగా యాంటీ ఫంగల్ అయిన పసుపుతో చేసిన వినాయకుడి నిమజ్జనం తర్వాత చెరువుల్లోని రోగకారకాలు అంతమవుతాయని శాస్త్రీయ వివరణ. అమ్మవారు బుజ్జి గణపతిని తొలుత పసుపు-నలుగుతోనే తయారుచేశారనేది పురాణ ప్రాశస్త్యం.



### గణపతి పూజలో 'గరిక'కు ప్రాధాన్యం.. కారణం ఇదే!

చవితి పూజలో ఎన్ని రకాల పుష్పాలు వాడినా పత్రిలో గరిక లేకపోతే వినాయకుడు లోటుగా భావిస్తాడని పూజారులు చెబుతున్నారు. పూర్వం అనలాసురుడు అనే రాక్షసుడు విపరీతమైన వేడి పుట్టించి దేవతల్ని ఇబ్బందులకు గురిచేశాడట. ఆ రాక్షసుడిని గణేశుడు మింగేయడంతో ఆయన శరీరం వేడిగా మారిందట. దీంతో రుషుల సూచనతో 21 గరిక పోచలను స్వామి తలపై పెట్టగా, వేడి తగ్గిపోయిందట. అందుకే పూజలో గరికకు ప్రాధాన్యం దక్కినట్లు చెబుతారు.



### గణపయ్యకు కుడుములు, ఉండ్రాళ్లే ఎందుకంటే...

వినాయక చవితి రోజున ప్రసాదం అంటే కుడుములు, ఉండ్రాళ్లే చేస్తాం. దానికో కారణముందంటారు పెద్దలు. ఈ దక్షిణాయన కాలంలో మన జీవక్రియ నెమ్మదిగా ఉంటుంది. అరుగుదల, ఆకలి రెండూ పెద్దగా ఉండవు. ఈ నేపథ్యంలో బియ్యప్పిండితో ఆవిరిమీద చేసిన వంటకాలు తేలిగ్గా అరగడమే కాక శరీరానికి ఆరోగ్యాన్ని, శక్తిని కూడా అందిస్తాయి. అందుకే చవితి నాడు కుడుములు, ఉండ్రాళ్ల వంటివాటిని వండుకుంటామనేది పెద్దల మాట.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# వినాయక చవితి స్పెషల్ మూవీ పోస్టర్స్














































